## బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో..

# ప్రతిపక్ష పార్టీల మైండ్ బ్లాక్

**కంటోన్మెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి తలసాని**



బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో జరిగిన నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ఇన్‌చార్జి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పక్కన అభ్యర్థి లాస్యనందిత

కంటోన్మెంట్, అక్టోబర్ 17: బీఆర్ఎస్ మ్యానిఫెస్టో చూసి ప్రతిపక్ష పార్టీల మైండ్ బ్లాక్ అయ్యిందని రాష్ట్ర మంత్రి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగడమే కాకుండా.. ప్రజలకు చెప్పింది చేయగల దమ్మున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు సాయన్న చేసిన సేవలకు గుర్తింపుగానే ఆయన కుమార్తె లాస్యనందితకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి కల్పించారని, పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కంటోన్మెంట్‌లో పోటీ చేసేందుకు ప్రతిపక్షాలు భయపడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేశ్, ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పేరువింటేనే..

# మోడీకి వణుకు

- ఇక్కడి పథకాలు యూపీ, గుజరాత్‌లో ఎందుకు లేవు ?
- మతవిద్వేషాలు రెచ్చగొట్టడమే బీజేపీ పని
- రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు మాత్రమే ఉంది
- మరోసారి ఆశీర్వదించండి.. మహేశ్వరంను ఆదర్శవంతంగా మారుస్తా
- ఆర్కేపురం డివిజన్ సమావేశంలో మంత్రి సబితారెడ్డి



ఆర్కేపురం డివిజన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, అక్టోబర్ 17: సీఎం కేసీఆర్ పేరు వింటేనే ప్రధాని మోడీకి వణుకుపుడుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సబితాఇంద్రారెడ్డి అన్నారు. గ్రీన్‌హిల్స్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి మంత్రి సబితా రెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ బలం, బలగం ప్రతి పక్షాలకు అంతుపట్టడం లేదని, సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్ష పార్టీల నాయకులు అయోమయానికి గురవుతున్నాయని చెప్పారు. ఎన్నికలు రాగానే తెలంగాణ మీద దండయాత్ర చేస్తున్నారని, డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకుంటున్న గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఓటు అడిగే హక్కు ఉన్నదని అన్నారు. సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లలో పార్టీ సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించి.. పార్టీ గెలుపునకు కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మీ ఆడ బిడ్డగా అడుగుతున్నా.. మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా మారుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ శ్రీధర్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, షాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరి రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణ ఆత్మగౌరవ భవనం నిర్మిస్తాం

- అర్హులందరికీ బీసీ బంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇప్పిస్తా
- నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన నాయీ బ్రాహ్మణ ఆత్మగౌరవ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, అక్టోబర్ 17: నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని త్వరలో ఎల్బీనగర్‌లో నాయీ బ్రాహ్మణ ఆత్మగౌరవ భవనాన్ని నిర్మిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈరెడ్డి గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్‌లో ఉన్న 22వేల మంది నాయీ బ్రాహ్మణులను తన సొంత కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నానని, అందరికీ బీసీ బంధు ఇచ్చి ఆదుకున్నామని తెలిపారు. అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు వచ్చే విధంగా కృషిచేస్తానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్‌పర్సన్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కమలాసుధీర్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు గడల రాజు, సంఘం ప్రతినిధులు ఆమంచి అంజయ్య, వెంకటేశ్ జంపాల, ఆర్.జైసింహ, వెంకటేశ్, దుబాయ్ నర్సింహ, అశ్వాల మహేశ్, మంకాల సుధాకర్, మామిడాల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పేదల మద్దతు బీఆర్ఎస్‌కే

*ఎమ్మెల్యే దానం నాగేందర్*



బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, అక్టోబర్ 17: పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం మనందరిపైనా ఉన్నదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం ఖైరతాబాద్ డివిజన్ సమీపంలోని తాజ్ దక్కన్ కింది బస్తీకి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం దానం నాగేందర్ మాట్లాడుతూ పేదల మద్దతు బీఆర్ఎస్ పార్టీకే ఉన్నదని, ఇతర పార్టీలకు తెలంగాణలో స్థానం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నేత అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో రూ.9వేల కోట్ల అభివృద్ధి

- ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, లింక్ రోడ్లు నిర్మించాం
- మరోసారి ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ




పార్టీలో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నేతలతో విప్ గాంధీ

మియాపూర్, అక్టోబర్ 17: బీఆర్ఎస్ ప్రభుత్వం సకల జనుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని, రాబోయే రోజుల్లో ఈ సంక్షేమం మరింత కొనసాగుతుందని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ప్రజా సంక్షేమం నచ్చే ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గులాబీ కండువా కప్పుకుంటున్నారని తెలిపారు. కొండాపూర్ డివిజన్ మస్తాన్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్ నేత సాయికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి విప్ గాంధీ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విప్ గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.9 వేల కోట్లతో విస్తృతమైన అభివృద్ధి పనులు చేపట్టామని, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, లింక్ రోడ్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. ప్రజల మద్దతుతో మూడోసారి అఖండ మెజార్టీతో విజయం సాధించి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గణేశ్, నాయినేని చంద్రకాంత్, ప్రసాద్, రాజు, గురవయ్య, నగేశ్, శ్రీను, వేణు, గురు, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్తూ.. ఆప్యాయంగా పలుకరిస్తూ..

సికింద్రాబాద్, అక్టోబర్ 17: సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ నిర్వహించిన 2వ రోజు పాదయాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మంగళవారం అంబర్‌నగర్‌లో ప్రచారం నిర్వహించిన పద్మారావుగౌడ్‌కు ప్రజలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్తూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలుకరిస్తూ ఆయన ముందుకు సాగుతున్నారు. ఓటేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సికింద్రాబాద్ కార్పొరేటర్లతో పాటు పద్మారావు గౌడ్ తనయులు కిశోర్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, త్రినేత్ర గౌడ్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చి పాదయాత్రలో పాల్గొన్నారు.

**ప్రచారంలో దూసుకుపోతున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్**



అంబర్‌నగర్‌లో ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్